దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీకి వినతి

వినాయక్‌నగర్, మార్చి 24 : తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సైకి విన్నవించినా పట్టించుకోవడం లేదని పోలీస్ కమిషనర్‌కు రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌కు చెందిన గోదావరి తన కూతురితో కలిసి సోమవారం ఫిర్యాదు చేసింది. తాను, తన కూతురు లక్ష్మి ఇంట్లో ఉండగా ఈ నెల 21న తన మరదలు ఉమా, ఆమె కుమారుడు భానుచందర్, ఉమా వాళ్ల బాబాయ్ మరో నలుగురితో కలిసి వచ్చి తమపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ దాడి విషయమై రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తమపై దాడి చేసిన వారి పై చర్యలు తీసుకొని, తమకు ప్రాణ రక్షణ కల్పించాలని తల్లి, కూతుళ్లు సీపీకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

న్యాయవాది హత్య హేయమైన చర్య

వినాయక్‌నగర్, మార్చి 24 : రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాది ఎర్రబాపును హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. హత్య ఘటనపై త్వరగా నేర విచారణ చేపట్టి, నిందితులపై చట్ట ప్రకారం శిక్షించే వరకు ఊరుకునేది లేదని పేర్కొన్నారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

వినాయక్‌నగర్, మార్చి 24 : నగరంలోని వీక్లీమార్కెట్ ఏరియాలో టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం దాడులు నిర్వహించి, 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నది. నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, అడిషనల్ డీసీపీ శ్రీనివాస రావు సిబ్బందితో కలిసి శ్రీసాయి కిరాణా షాపుపై దాడిచేశారు. అక్రమంగా నిల్వ చేసిన రూ. లక్ష విలువ చేసే 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సీజ్ చేసిన రైస్‌ను వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎస్సై గోవింద్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

పొతంగల్, మార్చి 24 : మండలంలోని కల్లూర్ గ్రామంలో బీర్కూర్ గంగారామ్‌కు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం కుటుంబీకులు సోమవారం ఉదయం ఇంట్లో పూజా కార్యక్రమం ముగించుకొని, వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించారు. కుటుంబీకులు ఇంటికి చేరుకొని స్థానికుల సహాయంతో మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు, ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తెచ్చిన నగదుతో పాటు బంగారాం, వెండి, నిత్యావసర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయని, సుమారు రూ. 3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేపట్టారు.

టీయూలో కబడ్డీ పోటీలు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 24 : టీయూలో యాన్యువల్ డే -2025 స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ఐదో రోజు సోమవారం కబడ్డీ బాలుర పోటీలను రిజిస్ట్రార్ ఎం.యాదగిరి సోమవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. మొదటిపోరులో ఎంఎస్సీ కెమిస్ట్రీ, అప్లాయిడ్ ఎకనామిక్స్ జట్టుతో తలపడగా 26 పాయింట్లతో అప్లాయిడ్ ఎకనామిక్స్ జట్టు గెలుపొందింది. రెండో పోరులో అప్‌లోడ్ ఎకనామిక్స్ జట్టు మాస్ కమ్యూనికేషన్ జట్టుపై 29 పాయింట్లతో విజయం సాధించినట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్, పీఆర్వో డాక్టర్ పున్నయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్.నేత, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి 82 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 24 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డివైడర్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

నందిపేట్ నుంచి గోదావరి నదిపై బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డుపై డివైడర్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నందిపేట్ మండలం చౌడమ్మ కొండూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ రోడ్డుపై ఏడాది కాలంలో 20 మందికి పైగా మృతిచెందారని, రోడ్డు గుండా ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారని పేర్కొన్నారు. చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషిచేయాలని కోరారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌కు వినతి

జక్రాన్‌పల్లి, మార్చి 24 : మండలంలోని అర్గుల్ గ్రామశివారులోని సర్వే నంబర్ 291లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని ఓ సొసైటీ పేరుతో అనుమతి పొందినట్లు పత్రాలు సృష్టించి పలువురు కాజేశారని అర్గుల్ వీడీసీ సభ్యులు ఆరోపించారు. ఆ భూమిని కాపాడాలని కోరుతూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఆ భూమిలో ఉన్న మొరాన్ని అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. ఆ భూమిని గ్రామ సమష్టి అవసరాల నిమిత్తం కేటాయించాలని, తప్పుడు పత్రాలను చూపించి ప్రభుత్వాన్ని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామస్తులపై వారు పెట్టిన కేసులు రద్దు చేయాలని విన్నవించామని చెప్పారు. కలెక్టర్ విచారణ చేపట్టాలని ఆర్డీవోను ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, దేవారాం, మహేశ్, రమేశ్, నరేశ్, రాజగంగారాం తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

కోటగిరి/ రుద్రూర్, మార్చి 24 : కోటగిరి మండలకేంద్రంలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను డీఈవో అశోక్ సోమవారం తనిఖీ చేశారు. ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైస్కూల్‌లోని ఎఫ్ఎల్ఎన్, కోటగిరి విద్యావనరుల కేంద్రంతోపాటు కోటగిరి కేజీబీవీని తనిఖీ చేశారు. రుద్రూర్ మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని డీఈవో అశోక్, సబ్‌కలెక్టర్ వికాస్‌మహతో, ఎంఈవో శ్రీనివాస్ పరిశీలించారు.

వార సంత వేలం

ధర్పల్లి, మార్చి 24 : మండలకేంద్రంలోని వారం సంత (తైబజార్)కు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం వేలం నిర్వహించారు. గతేడాది వారసంతను దక్కించుకున్న యాకుబ్ ఈ ఏడాది కూడా రూ.3,65,500కు వారసంత దక్కించుకున్నట్లు తెలిపారు. రోజూవారీ సంతకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం నిలిపివేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. రోజూవారీ సంతకు ప్రభుత్వం రూ. లక్షా 73 వేల ధర నిర్ణయించగా.. ఎవరూ ముందుకు రాకపోవడంతో రద్దు చేసినట్లు తెలిపారు. తదుపరి వేలం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రాజేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పలు సబ్జెక్టుల మూల్యాంకనం

ఖలీల్‌వాడి, మార్చి 24 : ఈనెల 26 నుంచి బోటనీ, జువాలజీ, కామర్స్, హిస్టరీ, కెమిస్ట్రీ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాలల లాగిన్లలో నిక్షిప్తం చేసినట్లు పేర్కొన్నారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లను డౌన్‌లోడ్ చేసుకుని, 26న ఉదయం 10 గంటలకు జిల్లా బాలుర జూనియర్ కళాశాలలోని మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నాట్ అపాయింట్‌మెంట్ లిస్ట్‌లో ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

నేటి నుంచి రాష్ట్ర రైతు సంఘం మహాసభలు

ప్రచారజాతను ప్రారంభిస్తున్న రైతు సంఘం నాయకులు

ఖలీల్‌వాడి, మార్చి 24 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర రైతు సంఘం మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజిరెడ్డి, సుధాకర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో ప్రచారజాతను సోమవారం వారు ప్రారంభించారు. గోనెరెడ్డి ఫంక్షన్ హాలులో బహిరంగ సభ ఉంటుందని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓమయ్య, నాయకులు రాధాకుమార్, మహేశ్, నర్సింహులు, శ్రీరాములుగౌడ్, వెంకట్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **క్రీడాకారులకు బహుమతుల అందజేత** -ధర్పల్లి, మార్చి 24 : భగత్‌సింగ్ 94వ స్మారకోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పీవైఎల్, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ. 7 వేలు, రెండో బహుమతిగా రూ. 3వేలతోపాటు మెమెంటోలు అందజేసినట్లు క్రీడల నిర్వహణ ఇన్‌చార్జి బాలయ్య తెలిపారు.
- **'చలో హైదరాబాద్‌కు తరలిరావాలి'** - రుద్రూర్, మార్చి 24 : పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నేడు (మంగళవారం)చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నెసాబ్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి ఏశాల గంగాధర్, పంచాయతీ కార్మికులు శంకర్, గంగారాం, లక్ష్మి, సాయవ్వ తదితరులు పాల్గొన్నారు.
- **సీసీ రోడ్డు పనులు ప్రారంభం** - డిచ్‌పల్లి, మార్చి 24 : మండలంలోని సుద్దపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను వీడీసీ సభ్యులు సోమవారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు రాజు, రమణాచారి, సుబ్బయ్య, భూమయ్య, సాగర్, లింగన్న, సాయికుమార్ పాల్గొన్నారు.
- **సెల్‌ఫోన్ అందజేత** - ధర్పల్లి, మార్చి 24 : మండల కేంద్రానికి చెందిన మేస్త్రీ పనిచేసుకునే వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను 15 రోజుల క్రితం పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి, ఫోన్‌ను రికవరీ చేశారు. బాధితుడికి సెల్‌ఫోన్‌ను ఎస్సై రామకృష్ణ సోమవారం అందజేశారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషిచేయాలి

ఖలీల్‌వాడి/నవీపేట, మార్చి 24 : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టీబీ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ జనరల్ దవాఖాన వద్ద ర్యాలీని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. వ్యాధి బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం, టీబీ నియంత్రణ విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ రవిగౌడ్, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. నవీపేట ప్రభుత్వ దవాఖానలో ప్రపంచ టీబీ డేను నిర్వహించారు. వైఆర్‌జీ కేర్ సీఎల్ డబ్ల్యూ ఒడ్డె రవి మాట్లాడారు.

అవగాహన ర్యాలీలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

ర్యాలీని ప్రారంభిస్తున్న కిరణ్‌కుమార్

వే బిల్లులు తక్కువ.. ఇసుక తరలింపు ఎక్కువ

ఏర్గట్ల, మార్చి 23: మండల కేంద్రంలోని బట్టాపూర్ శివారులో ఉన్న పెద్ద వాగు నుంచి అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతున్నది. కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాలకు కలిపి మొత్తం 102 వే బిల్లులను సోమవారం మంజూరు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కానీ మంజూరైన వే బిల్లుల కంటే ఎక్కువ మొత్తంలో సాయంత్రం 5 గంటల వరకు పెద్ద వాగు నుంచి ఇసుకను తరలించినట్లు తెలిసింది. నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లలో వేరే మండలాలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఖలీల్‌వాడి, మార్చి 24 : తెలంగాణ ప్రగతిశీల భవన, నిర్మాణ రంగ కార్మిక సంఘం (టీయూసీఐ) రాష్ట్ర 3వ మహాసభ పోస్టర్లను టీయూసీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లీలో సోమవారం ఆవిష్కరించారు. ఆసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ముందస్తు అరెస్టు

బోధన్‌లో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆశవర్కర్లు

శక్కర్‌నగర్, మార్చి 24 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు సోమవారం చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బోధన్‌లో పోలీసులు ఆశ వర్కర్లు, సంఘ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఆ సంఘం నాయకులు జమ్మి శెట్టి శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్ మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారని, ఇది సరికాదని అన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు అనిత, బాలమణి, కళ్యాణి, ప్రశాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

ఉజ్జయినిలో బీకేఎస్ కౌన్సిల్ సమావేశం

- పాల్గొన్న జిల్లా రైతులు
- దేశీ వరి వంగడాల ప్రదర్శన

సారంగాపూర్, మార్చి 24 : భారత్ కృషక్ సమాజ్ (బీకేఎస్) 68వ కౌన్సిల్ మెంబర్ల సమావేశం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని నగరంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది రైతులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి చిన్నికృష్ణుడు అలియాస్ నాగుల గంగారాం, వొజ్జం రవీందర్, పీసు ప్రదీప్‌రెడ్డి, అశోక్ హాజరయ్యారు. కృషక్ సమాజ్ ఆధ్యక్షుడు అజయ్ జక్కరు ఆధ్వర్యంలో ఒకరోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన చిన్నికృష్ణుడు 155 దేశీ వరి వంగడాలతో ప్రదర్శన ఇచ్చాడు. ప్రకృతి వ్యవసాయం చేసే విధానం, దీని ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న రైతు చిన్నికృష్ణుడు

బీపీఎంకు ఆరునెలల జైలుశిక్ష

శక్కర్‌నగర్, మార్చి 24: ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా 2014లో విధులు నిర్వహించిన పిండి వారి కృష్ణమూర్తికి ఆరు నెలల సాధారణ జైలుశిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం బోధన్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఈ.సాయిశివ తీర్పు చెప్పారు. ఖాతాదారుల డిపాజిట్ డబ్బులు రూ.35,771 దుర్వినియోగం చేయడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కృష్ణమూర్తిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. అప్పటి ఎస్సై యాకూబ్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి సోమవారం శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కారు డ్రైవర్‌కు ఆరు రోజుల జైలు శిక్ష

బోధన్, మార్చి 24: బోధన్ పట్టణ శివారులో ద్విచక్ర వాహనాన్ని కారుతో ఢీకొట్టిన సంఘటనలో కారు డ్రైవర్ షేక్ మగ్దూమ్ సులేమాన్‌కు ఆరు రోజుల జైలుశిక్షతోపాటు రూ. వేయి జరిమానా విధిస్తూ బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్పశాయి సోమవారం తీర్పు చెప్పారు. పట్టణ శివారులో స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని అజాగ్రత్తగా కారును నడిపి వెనుక నుంచి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ వెల్లడించారు.

కమ్మర్‌పల్లి నృత్య కళాకారుల ప్రతిభ

మోర్తాడ్, మార్చి24: భాస్కర ఆడిటోరియం బిర్లా సైన్స్‌సెంటర్ హైదరాబాద్ వేదికగా సోమవారం కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన ఉగాది విశిష్టపురస్కార నృత్య పోటీల్లో కమ్మర్‌పల్లి శ్రీపరమేశ్వర నృత్యకళానిలయం విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈపోటీల్లో పాల్గొన్న శివాని, నమ్రత, భవ్యశ్రీ, లరణ్య, మధుశ్రీ, అక్షర, రిషిప్రియ, మిథిలాదేవి, చైత్ర, భువనేశ్వరీ పాల్గొని ప్రతిభ చూపగా నటరాజు విగ్రహాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. వీరు ఇండియన్ బుక్‌ఆఫ్ రికార్డు కూడా సొంతం చేసుకున్నట్లు కూడిపూడి నాట్యగురువు శిరీష తెలిపారు.

రైతు నాయకుల ముందస్తు అరెస్టు

- జగిత్యాల జిల్లా రైతు జేఏసీ తలపెట్టిన 'చలో అసెంబ్లీ'ని అడ్డుకున్న పోలీసులు
- ఆర్మూర్, మోర్తాడ్, వేల్పూర్ మండలాల్లో రైతుల నిర్బంధం

కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో రేగుంట దేవేందర్

వేల్పూర్‌లో..

మోర్తాడ్/ ఆర్మూర్ టౌన్/ వేల్పూర్/ముప్కాల్, మార్చి 24: జగిత్యాల జిల్లా రైతు జేఏసీ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా నిజామాబాద్ జిల్లా రైతు నాయకులను పోలీసులు నిర్బంధించారు. ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా రైతు జేఏసీ సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లాలోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, ముప్కాల్, ఆర్మూర్ మండలాల్లో రైతులతోపాటు రైతునాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, ఆర్మూర్‌కు చెందిన రైతు జేఏసీ నాయకుడు లింగారెడ్డి, రైతు ఐక్య కార్యాచరణ జేఏసీ నాయకులు, ముప్కాల్‌కు చెందిన రైతు నాయకులు నిమ్మల శ్రీనివాస్, గడ్డం సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఉప్లూర్ సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా, కనీసం రైతులు నిరసన తెలుపుకునే అవకాశం కూడా ఇవ్వకుండా నిర్బంధించడం విడ్డూరమన్నారు. ఆర్మూర్‌లో రైతు జేఏసీ నాయకుడు లింగారెడ్డి మాట్లాడుతూ.. ఇది రైతుల ప్రభుత్వం కాదని బోగస్ ప్రభుత్వమని మండిపడ్డారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రూ. 2 లక్షల రుణ మాఫీ అందరికీ చేయాలని, రైతు భరోసా ఎకరానికి రూ. 12 వేలు చెల్లించాలని, సన్నవరి ధాన్యానికి బోనస్ రాని వారికి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో రైతు నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పసుపునకు క్వింటాలుకు రూ.15వేలు ప్రకటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పసుపు పంటకు ఇస్తామన్న రూ.12వేలు బోనస్ రూపంలో ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా హామీలను అమలుచేసేలా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బోధన్ జిల్లా దవాఖాన తనిఖీ

శక్కర్‌నగర్, మార్చి 24: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను సోమవారం 'కాయకల్ప' అధికారుల బృందం సందర్శించింది. మెదక్ జిల్లా నర్సాపూర్ దవాఖాన ఆర్ఎంవో రాజేశ్ నేతృత్వంలో పలువురు వైద్యుల బృందం దవాఖానను సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించింది. దవాఖానలో అందుతున్న సేవలు, వసతులపై నివేదికను సంబంధిత అధికారులకు నివేదిస్తామని బృందం వెల్లడించింది. వారి వెంట డాక్టర్లు సౌమ్య, రమ, సుష్మ, ప్రశాంత్‌తోపాటు డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ రాహుల్ తదితరులు ఉన్నారు.

దవాఖానలోని ప్రసూతి విభాగం వద్ద పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

పరీక్షా కేంద్రంలో వీల్‌చైర్ ఏర్పాటు

పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన వీల్‌చైర్

బోధన్, మార్చి 24: పదో తరగతి పరీక్షలు రాస్తున్న దివ్యాంగ విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవని, వీల్‌చైర్ లేక విద్యార్థి ఎదుర్కొన్న ఇబ్బందిపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు మరుసటి రోజు ముందుగా సదరు విద్యార్థిని గ్రౌండ్‌ఫ్లోర్‌కు మార్చారు. సోమవారం వీల్‌చైర్‌ను ఏర్పాటు చేశారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో వీల్‌చైర్‌ను ఏర్పాటు చేసి వారికి సహాయం అందించేందుకు ఈఈ ఆర్పీ లత, పద్మను అందుబాటులో ఉంచామని ఎంఈవో నాగయ్య తెలిపారు.

సంక్షిప్తంగా..

- **పాగాకు కొనుగోలు చేయాలి**- రెంజల్, మార్చి 24: మండలంలో పొగాకు పంట సాగు చేసినందున కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు.
- **బోధన్ డిపో మేనేజర్‌గా విశ్వనాథ్** - బోధన్, మార్చి 24: ఆర్టీసీ బోధన్ డిపో మేనేజర్‌గా విశ్వనాథ్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేసిన శ్రీనివాస్ కరీంనగర్- 2 డిపో మేనేజర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.
- **నీలా వద్ద పోలీస్ పికెటింగ్** - రెంజల్, మార్చి 24: నీలా గ్రామంలో పోలీసులు పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. కందకుర్తి -నవీపేట ప్రధాన రోడ్డు నీలా గ్రామంలో ఓ వర్గానికి చెందిన దిమ్మె వద్ద జెండా ఆవిష్కరణ విషయంలో ఇరువర్గాల మధ్య గొడవలకు ఆస్కారం లేకుండా పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు రెంజల్ పోలీసులు తెలిపారు.
- **పరిహారం చెల్